రేపు వాహనవేలం

రాజేంద్రనగర్ : శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాల వేలం ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 25వ తేది ఉదయం 10 గంటల లోపు ఉప్పర్‌పల్లిలోని ఎక్సైజ్ ఆఫీసులో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళిలో 236 మద్యం కేసులు

రాజేంద్రనగర్: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన అనంతరం 236 ఎక్సైజ్ కేసులను నమోదు చేశామని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌దేవేందర్ తెలిపారు. గురువారం స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 8 నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుండి ఎక్సైజ్ పరిధిలో ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. ఎక్సైజ్ సుంకం చెల్లించని మద్యంతో పాటు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 236 కేసులను నమోదు చేసి వాటి మొత్తం విలువ రూ.84 లక్షలు ఉంటుందన్నారు. తమ ప్రాంతాల్లో మద్యం నిల్వచేసిన, అక్రమంగా మద్యం విక్రయించిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సంప్రదించాల్సిన నెంబరు 8712658750. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

'హరిజనుల' పేరుతో బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్: సిద్ధాంతి బస్తీకి చెందిన హరిజనుల పేరు చెప్పి దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్ధాంతి హరిజన సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం సిద్ధాంతిలో వారు మాట్లాడారు. హరిజనులతో ఎస్సీ కేసు పెట్టిస్తానని ఓ వ్యక్తి వృద్ధుడిని బెదిరించిన ఘటనపై స్థానికులు స్పందించారు. సిద్ధాంతిలో విద్యావంతులు, మేధావులైన హరిజనులున్నారన్నారు. బస్తీ పేరును వాడుకుని బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హరిజన సంఘం నాయకులు పెద్దగండు పాపారాయుడు, డి.కుమార్, రాజేందర్, సుధాకర్, రాచమల్ల యాదగిరి, సుబోదు, రవికుమార్, జేమ్స్ తదితరులున్నారు.

27న మీరాలంమండిలో మహా అన్నకూట మహోత్సవాలు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 27న మహా అన్నకూట మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ, మంగళ హారతి, 11 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 12.30 గంటలకు తులసి పూజ, సాయంత్రం 5.30 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, ఆకాశ దీపం, 7 గంటలకు పంచ హారతి, సామూహిక హారతి, 7.15 గంటలకు మహా అన్నకూట (అన్న ప్రసాదం) కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

ఈవీఎంల కమిషనింగ్ షురూ

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్‌ను అధికారులు నిజాం కాలేజీలోని డీఆర్‌సీ సెంటర్‌లో ప్రారంభించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించిన పార్టీ పేరు, అభ్యర్థి పేరు, గుర్తులతో కూడిన వివరాలను ఈవీఎంలో అప్లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యప్రకాష్ పర్యవేక్షణలో ఈ కమిషనింగ్ కార్యక్రమం కొనసాగుతోంది

గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం

దూద్‌బౌలి: గుల్జార్‌హౌస్ వద్ద కాలికమాన్ రోడ్డులోని ఓ విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ నెట్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం ఉదయం 9 గంటలకు విద్యుత్ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగలు అలముకున్నాయి. అగ్నిప్రమాదం కారణంగా స్థానిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది. చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి పరిస్థితిని చక్కదిద్దారు.

గృహిణి అదృశ్యం


రేణుక (ఫైల్)

సుల్తాన్‌బజార్: విధులకు వెళ్లి ఓ గృహిణి అదృశ్యమైన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకకు చెందిన రేణుక (31), రాంకోఠిలోని విశిష్ట అపార్ట్‌మెంట్‌లో ఇంటి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈనెల 21న విధులకు వెళ్లిన రేణుక రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై చుట్టుపక్కల ప్రాంతాల్లో తెలిసిన వారిని వాకాబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం సుల్తాన్ బజార్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు రేణుక ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

అఫ్జల్‌సాగర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

నాంపల్లి: బీజేపీ అభ్యర్థి జేఎల్.రాహుల్‌చంద్ర గురువారం అఫ్జల్‌సాగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరిని కలుస్తూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అవుతారని, రాష్ట్రానికి సరిపడా నిధు లు సమకూరుతాయని చెప్పారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయవద్దని కోరారు. జగన్నాథరాజ్, విజయ్‌సింగ్, అర్జున్ సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక భక్తులు పాల్గొని కార్తీక మాసం పల్లకీ సేవను చేపట్టారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని రాష్ట్ర పీఆర్టీయూ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి అధ్యక్షతన స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తొలి మెట్టు పాఠశాల అని చెప్పారు. గురువును మించిన దైవం లేదని సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ పార్టీ అలవోకగా గెలుస్తుందని, ప్రజలు ఎక్కడ చూసినా బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, శివరాంపల్లిలో భారీ రోడ్‌షోను నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్‌షోలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు భారీ గజమాలతో ప్రకాష్‌గౌడ్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లో తాను చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసునని, తప్పకుండా నాల్గోసారి అసెంబ్లీకి పంపడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన ప్రజాభిమానం బీఆర్ఎస్‌పై చూపుతున్నారన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ.. ప్రజాసేవకే నా పూర్తి జీవితం అంకితం చేశానని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, ఇంద్రపాల్ రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రవణ్ తదితరులున్నారు.


గదతో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే


శివరాంపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ప్రకాష్‌గౌడ్

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్

మణికొండ: దేశంలో పేదల కోసం ఆలోచన చేయటంతో పాటు వారి సంక్షేమానికి పెద్దపీట వేసి పనిచేసే పార్టీ కేవలం కాంగ్రెస్‌నేనని, దానికి ఓటువేసి ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి ఒక్కరూ సంక్షేమంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి, ఖానాపూర్, సబితానగర్, శాంతినగర్, కోకాపేట, మంచిరేవుల, నార్సింగిలలో రోడ్‌షో నిర్వహించి ముఖ్య కూడలిలలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు, రాజీవ్ గృహకల్ప, ఆరోగ్యశ్రీ కార్డులు, పెన్షన్‌లు, రేషన్ కార్డులు ఇవ్వటంతో పాటు నియోజకవర్గంలో ఔటర్‌రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టులను నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కోకాపేటలో ఇచ్చిన 60 గజాల స్థలాలను లాక్కుని, భూమిని అమ్ముకున్న ఘనత బీఆర్ఎస్ పార్టీదని ఆరోపించారు. అవసరం ఉన్న వారికి రేషన్‌కార్డు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇళ్లులేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షల నగదు, 200 యూనిట్ల వరకు ఇంటికి ఉచిత విద్యుత్, ప్రతినెల రూ.2500లు మహాలక్ష్మి పథకం, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా పథకాలను అందిస్తామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గండయ్య, అశోక్, యాదగిరి, కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, దుర్గేష్‌యాదవ్, విజయ్‌బాబు, నరేష్, లక్ష్మీప్రవళిక కిరణ్‌కుమార్, నాయకులు రాము, కిరణ్‌కుమార్, వినోద్, వేణుగౌడ్, కిషన్, గణేష్, సాయిరాం, వెంకటేష్, సురేష్‌బాబు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో మహిళలు మంగళహారతులు, యువకులు గజమాలలతో స్వాగతం పలికారు.


ఖానాపూర్‌లో గజమాలతో నరేందర్‌కు ఘన స్వాగతం


మంచిరేవుల రోడ్‌షోలో..

ఎన్నికల హామీని నెరవేర్చలేదు

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నేరవేర్చలేదని, బుద్వేల్ ప్రాంతంలో ఐటీపార్కు తీసుకొస్తానని భూములను అమ్ముకున్నారని రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రశ్నలకు తోకల శ్రీనివాస్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.



ప్రశ్న : కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలు నమ్మి ఓటు వేస్తారా?

జవాబు: కాంగ్రెస్ పార్టీ గత పదేళ్ల ముందు పరిపాలన చేసి ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఆరు గ్యారంటీలు అంటు ప్రజల్లోకి వస్తుంది. మొన్నటి ఎన్నికల్లో కర్ణాటకలో ఆరు పథకాలను అమలు పరుస్తామని చెప్పి, ఓట్లు వేయించుకుని ఇప్పుడు రెండు పథకాలను సరిగ్గా తీసుకుని అమలు చేయలేని పరిస్థితి ఉందని దుయ్యబట్టారు. కర్ణాటక రైతులు తెలంగాణలోకి వచ్చి మేము కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి మోసపోయామని ఇక్కడికి వచ్చి మొర పెట్టుకుంటున్నారన్నారు.

ప్రశ్న: బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎవరు గెలిచినా ఒక్కటేనని అంటున్నారు వాస్తవమేనా ?

జవాబు: బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటి కావు. బీజేపీ రాష్ట్రంలో ఒంటరిగానే పోటి చేస్తున్నది. బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటైతే ప్రధానమంత్రి, హోంమంత్రి రాష్ట్రానికి ఎందుకొస్తున్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీని గెలిపించడానికి అన్ని కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు. రాజేంద్రనగర్‌ను సింగపూర్ సిటీ చేస్తానని బుద్వేల్ భూములు అమ్ముకుని శిలాఫలకాలకే పరిమితమైంది. ప్రజలు అన్ని గమనిస్తున్నారు.

ప్రశ్న: యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు ?

జవాబు: రాజేంద్రనగర్‌లో మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం కూడా చదువలేక తడబడ్డ విషయం యువతకు తెలిసిందే. ఇప్పుడు నియోజకవర్గం యువతకు తెలిసిపోయింది రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివద్ధి చేయలేని అసమర్థున్ని ఇన్ని రోజులు ఎన్నుకున్నామని, ఇప్పుడు చదువుకున్న అభ్యర్థి అసెంబ్లీలో ప్రజా సమస్యల కోసం నిలదీసే నాయకుడిని ఎన్నుకుందామని యువత నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈసారి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా తనను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. తాను గెలిస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

ప్రశ్న: రాజేంద్రనగర్‌లో కేటీఆర్ ప్రభావం ఎలా ఉంటుంది ?

జవాబు: రాజేంద్రనగర్‌లో కేటీఆర్ రోడ్‌షోతో బీజేపీపై ఎలాంటి ప్రభావం ఉండదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఆయన రోడ్‌షో చేశారు. ప్రజలు ఆయన నమ్మలేదు. మూడు డివిజన్లను బీజేపీ కై వసం చేసుకున్నది.

సమన్వయంతో కలిసి పనిచేయాలి

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలంతా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ), సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పుల (బీఐఎస్), ఓటర్ గైడ్‌ల పంపిణీ, ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్‌లిస్ట్‌ల విషయంపై సమీక్షించారు. అధికారులు, సిబ్బంది తమకు ఇచ్చిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

అవినీతి పాలనను పారదోలేందుకు ప్రజలు సిద్ధం

బండ్లగూడ: బీఆర్ఎస్ అవినీతి పాలనను పారదోలడానికి ప్రజలంతా సిద్ధం కావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హైదర్షాకోట్, బైరాగిగూడ, గంధంగూడలో భారీ రోడ్‌షో నిర్వహించారు. శివసాయినగర్, శాఖరగుట్ట, గాంధీనగర్ కాలనీల మీదుగా రోడ్‌షో యాత్ర కొనసాగింది. అడుగడుగునా నీరాజనాలు పడుతూ.. బీజేపీకి మద్దతు తెలిపారు. ప్రజలు 'బై బై ప్రకాష్‌గౌడ్' నినాదాలతో హోరెత్తించారు. అభిమానులు మూడు గంటలకుపైగా సాగిన ర్యాలీ ఇంటింటికి పోస్టర్లు అంటిస్తూ.. తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా తోకల మాట్లాడుతూ.. ప్రకాష్‌గౌడ్ అవినీతి, కబ్జా వ్యవహారాలను డాక్యుమెంట్లతో సహా నిరూపిస్తామన్నారు. సంక్షేమ పథకాలను అసలైన లబ్ధిదారులకు కాకుండా తమ అనుచరులకే ఇప్పించుకున్న మాట వాస్తవం కాదా అని ఎమ్మెల్యేను తోకల ప్రశ్నించారు. ఓటమి భయంతో ఇతర పార్టీల నాయకులను ప్రలోభ పెడుతున్నారన్నారు. మైనార్టీ ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ నీచరాజకీయాలకు పాల్పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా బీజేపీకి మద్దతు పలుకుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి


రోడ్‌షోలో బీజేపీ శ్రేణులు

నీటి నాణ్యతపై తనిఖీలు

ఫిలింనగర్: నీటి సరఫరా వేళల్లో నీటి నాణ్యతా పరిశీలన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్ అన్నారు. గురువారం ఫిలింనగర్‌లోని బాల్‌రెడ్డినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో పర్యటించి నీటి శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతను పరిశీలించారు. నీటి సరఫరా వేళల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్న జలమండలి ఎండి దాన కిషోర్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హరి శంకర్ తెలిపారు. నీటి సరఫరా వేళల్లో పర్యటిస్తే సమస్యలను గుర్తించడంతో పాటు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.


నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

మాలల మద్దతు కాంగ్రెస్‌కే: చెన్నయ్య

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆమెకు అండగా నిలబడదామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. గురువారం బంజారాహిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దళితుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసింది కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. ఆ పార్టీకి మాలలంతా అండగా నిలబడాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, బల్వంతరావు, బత్తుల రాంప్రసాద్, గడ్డం శ్రీనివాస్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు నివాళి



సాక్షి, సిటీబ్యూరో: దివంగత నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. చంద్రమోహన్ మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, చంద్రమోహన్ సతీమణి జలంధర, పెద్ద కుమార్తె మధుర, రెండో కుమార్తె మాధవి, మనువరాళ్లు చిన్మయి, శ్రీకర, నిర్మాత ఆదిశేషగిరిరావు, దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, గాయకుడు ఎస్పీ చరణ్, దర్శకులు రేలంగి నరసింహారావులు చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

దళిత బహుజన పార్టీ అభ్యర్థులను గెలిపించండి

లిబర్టీ: పేద దళిత జనుల సమస్యలు పరిష్కారం కావాలంటే దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్, జాతీయ ఉపాధ్యక్షుడు సి.యాదగిరి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు రాజకీయ పార్టీల తాయిలాలకు లొంగకుండా నిజమైన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే చట్టసభల్లో ప్రజల వాదాన్ని వినిపిస్తారన్నారు. గురువారం పార్టీ అభ్యర్థుల కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల అభ్యర్థులను ఓడించాలని కోరారు. డబ్బు, మద్యానికి తలొగ్గకూడదని విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ అభ్యర్థి శ్యామ్‌కుమర్ పాల్గొన్నారు.

రియల్టర్ ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: పెళ్లికి వెళ్లి వచ్చేలోపు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కాలనీలో నివసించే వై.శ్రీరాఘవ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. నెల కిందట బంగారం, డైమండ్స్ తదితర వస్తువులు తన అల్మారాలో ఉంచి తాళాలు వేశాడు. ఈ నెల 23న వివాహానికి హాజరు కావానికి వెళ్లాడు. తిరిగి వచ్చి అల్మారాను చెక్ చేసుకోగా అతని వస్తువులు కనిపించలేదు. తన వద్ద పని చేసే రాములు అనే వ్యక్తిపై అనుమానం ఉందని, దాదాపు దాదాపు రూ. 5 లక్షలు ఖరీదు చేసే 20 తులాలు బంగారు, డైమండ్స్ వస్తువులు దొంగిలించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలి

గోల్కొండ: బీఆర్ఎస్ అండతో మజ్లిస్ పార్టీ హైదరాబాద్‌లో గుండాగిరి చేస్తుందని కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. అసదుద్దీన్ ఒవైసీ ఎన్నికల విధుల్లో ఉన్న ఓ పోలీస్ అధికారిని దూషించి తన గుండాగిరిని చాటుకున్నారన్నారు. బీఆర్ఎస్ అండతో మజ్లిస్ అరాచకాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, వారిని ఓడించాలన్నారు. పదేళ్లల్లో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను అన్ని విధాలుగా దోచుకొని రాష్ట్రాన్ని దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ సైతం ప్రజలను మోసం చేయడానికి రంగంలోకి వచ్చిందన్నారు. స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీని గెలిపించాలని ఓటర్లను ఆయన కోరారు.

ఆశీర్వదించి మరోసారి గెలిపించండి

గోల్కొండ: ఈసారి కూడా తనను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని గత పదేళ్లల్లో ఎంతగానో అభివృద్ధి చేశానన్నారు. తమ పార్టీపై బీజేపీ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం మజ్లిస్ దేనికైనా తెగిస్తుందన్నారు. నేడు తమ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం పేద కార్మికుల పక్షాన నిలిచిపోరాడుతున్న ఏకైక నాయకుడని ఆయన అన్నారు. ఈసారి కూడా కార్వాన్ నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్, షకీల్‌ఆలీఖాన్, ఏకే పఠాన్ తదితరులున్నారు.

మంగారి రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి

సుల్తాన్‌బజార్: న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వృత్తి గతంగా, కవిగా, కథా రచయితగా, అనువాదకునిగా ప్రవృత్తి గతంగా తెలుగు భాషకు విశేషమైన సేవలు అందిస్తున్న మంగారి రాజేందర్ జింబో బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. గురువారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మంగారి రాజేందర్ 'నేను–నా రచనలు' శీర్షికన తమ జీవితం సాహిత్య జీవితంపై ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఆచార్య శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ విశిష్ట అతిథిగా ప్రసంగిస్తూ జింబో కలం పేరుతో రచనలు చేస్తున్న మంగారి రాజేందర్ కొన్ని సంవత్సరాల కిందటే న్యాయమూర్తిగా తెలుగులో తీర్పు వెలువరించిన ఘటన సంచలనమైందని తెలిపారు.